ఆలయ పునఃప్రతిష్ఠను రావాలని జిల్లా జడ్జికి ఆహ్వానం

జడ్జికి ఆహ్వానపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 1: నగరంలోని నాందేవ్‌వాడలో శ్రీసంతోషిమాత, సాయిబాబా ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవానికి రావాలని కోరుతూ ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా జడ్జి సునీత కుంచాలకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్ గౌడ్, ఆలయ సేవా సమితి అధ్యక్షుడు పార్శి కాశీనాథ్ గుప్తా, కార్యదర్శి పట్టేవార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన తునికాకు అందజేయాలి

ఇందల్వాయి(డిచ్‌పల్లి), ఏప్రిల్ 1: బీడీ కార్మికులకు శివాజీ బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యం నాణ్యమైన తునికాకు అందజేయాలని కమీషన్‌దారులు కోరారు. ఈ మేరకు ఫ్యాక్టరీ మేనేజర్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమీషన్‌దారులు మాట్లాడుతూ.. నాసిరకం తునికాకు ఇవ్వడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వెయ్యి బీడీల కోసం అందజేస్తున్న తునికాకు కేవలం ఐదు వందల బీడీలకు మాత్రమే సరిపోతున్నదని తెలిపారు. కార్మికశాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు నాణ్యమైన తునికాకు ఇవ్వని పక్షంలో కార్మికులను సమీక్షించి ఫ్యాక్టరీని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, మురళి, గణేశ్, శ్రీధర్, రఘు, గోవర్ధన్, సాయిలు, నారాయణ, సాయినాథ్, సురేశ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 1: ఇండియన్ పీడియాట్రిక్ సొసైటీ, డాక్టర్ విశాల్ చైల్డ్ గైడెన్స్ క్లినిక్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటిజంపై పలువురు తల్లిదండ్రులు, వైద్యులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి డాక్టర్ విశాల్ చైల్డ్ గైడెన్స్ క్లినిక్ అందుబాటులో ఉన్నదని డాక్టర్ విశాల్ తెలిపారు. ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జీవన్‌రావు, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ జీవన్‌రావు, అధ్యాత్మిక కార్యకర్త చిరంజీవచార్యులు పాల్గొన్నారు.

మిమిక్రీ శంకర్‌కు సన్మానం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 1: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మిమిక్రీ కళాకారుల వెల్ఫేర్ అసోసియేషన్, జేసీఐ ఇండియన్ జోన్ -12 సంయుక్తంగా మిమిక్రీ మేళాను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. సీనియర్ కళాకారుడిగా జిల్లాకు చెందిన మిమిక్రీ శంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో శోభ, వేణుమాధవ్, నేరెళ్ల శ్రీనాథ్, రాజు, శివారెడ్డి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 1: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్సపల్లిలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో జాప్యం చేయడంతో ధాన్యం దళారులకు విక్రయించి నష్టపోతున్నారని తెలిపారు. నాయకులు నర్సయ్య, సాయిలు, గోపాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రతినెలా 8,248 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ

కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఏప్రిల్ 1: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమ అమలుకు మంగళవారం శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు కలిగిన 4,02,154 కుటుంబాల్లోని 13,10,012 మందికి ప్రతినెలా 8,248.076 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 3,80,222 ఆహార భద్రత కార్డులుండగా.. అందులోని 12,50,996 మందికి ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున 7505.856 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అంత్యోదయ కార్డులు 20,916 ఉండగా వాటిలోని 57,997 మందికి 732.060 మెట్రిక్ టన్నులు, అన్నపూర్ణ కార్డులు 1,016 ఉండగా 1,039 మందికి 10.160 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ప్రతి నెలా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 759 ప్రజాపంపిణీ కేంద్రాల ద్వారా కార్డుదారులందరికీ నిర్దేశిత కోటా మేరకు సన్నబియ్యం పంపిణీ జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

కేంద్రం నుంచి నిధులు తెచ్చే సత్తా లేదు..

సారంగాపూర్, ఏప్రిల్ 1: కేంద్రం నుంచి నిధులు తెచ్చే సత్తా లేని.. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు బీజేపీ మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉండి ఏం లాభం అని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని మల్లారం గ్రామంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిధుల కేటాయింపుల్లో ప్రధాని మోదీ పక్షపాత ధోరణిని అవలంభిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రజలు పలు సమస్యలపై వినతులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు చంద్రశేఖర్ గౌడ్, ఎల్లయ్య, బాగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి వాసికి పద్మ ప్రతిభారత్న అవార్డు

అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఓం ప్రకాశ్

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 1: జక్రాన్‌పల్లికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, పద్మ కోకిల, అష్టావధాని డాక్టర్ ఓం ప్రకాశ్ పద్మ ప్రతిభారత్న, విశిష్ట అవధాన సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో ఆయనకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. సినిమా నటులు సంధ్యాజనక్, బాలాజీ ఆయనకు పురస్కారాలు అందజేశారు. ఆయనకు అవార్డు రావడంపై ప్రముఖ కవి, వ్యాఖ్యాత వీపీ చందన్‌రావు, జిల్లా సాహితీవేత్తలు, కవులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘ సాంస్కృతిక కార్యదర్శి శ్రీపుత్ర స్వామి, ప్రసాదం స్వాతి, ఘనపురం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

కవిత వినిపిస్తున్న శంకర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 1: ఉగాది పండుగ పురస్కరించుకొని బోర్గాం(పీ) లక్ష్మీ గణపతి ఆలయంలో మంగళవారం ఆధ్యాత్మిక కవి సమ్మేళనం నిర్వహించారు. డీఈవో అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక చైతన్యం కలిగించే కవితలు వర్తమాన కవులు రాయాలని సూచించారు. కవితా గానం చేసిన పలువురు కవులను సన్మానించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అరుణ్‌కుమార్ శర్మతో పాటు డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, దారం గంగాధర్, జనగామ చంద్రశేఖర్ శర్మ, చెన్న శంకర్, రిపర్స్‌గేర్ నవీన్, రమణ, ఇప్పకాయల సుదర్శన్ పాల్గొన్నారు.

మోపాల్ మండలంలోని సిర్పూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో 2004-2005 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు తమ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. అప్పటి విషయాలను గుర్తుచేసుకొని సరదాగా గడిపారు. ఆపదలో ఉన్నవారిని అండగా ఉంటామన్నారు.

- ఖలీల్‌వాడి(మోపాల్), ఏప్రిల్ 1

చెత్తకుప్పకు నిప్పంటించడంతో కారు దగ్ధం

మంటలు అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

వినాయక్‌నగర్, ఏప్రిల్ 1: గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడంతో అక్కడే పార్క్ చేసిన కారు కాలిపోయిన ఘటన ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎల్లమ్మగుట్ట ఏరియాలోని ఎల్ఐసీ ఆఫీసు వెనుకాల ఖాళీ ప్రదేశంలో చెత్త పేరుకుపోయింది. దానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటలు ఎగిసిపడి అక్కడే పార్క్ చేసిన కారు సైతం కాలిపోయింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

షార్ట్ సర్క్యూట్‌తో షాపు దగ్ధం..

వినాయక్‌నగర్, ఏప్రిల్ 1: నగరంలోని ప్రగతినగర్‌లో ఉన్న ఓ దుకాణం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దుకాణం మంగళవారం మూసి ఉండగా.. అందులో నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. షాపులో ఫర్నిచర్, ఇతర వస్తువులు కాలిపోయాయని స్థానికులు తెలిపారు.

వేట కొడవలితో అర్ధరాత్రి యువకుడి హల్‌చల్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 1: చేతిలో వేట కొడవలితో ఓ యువకుడు నగరంలో సోమవారం అర్ధరాత్రి హల్‌చల్ చేశాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హైమదీపురా కాలనీకి చెందిన జబ్బార్ వేట కొడవలి పట్టుకొని.. అతడిని తరచూ బెదిరిస్తున్న ఇస్తాక్‌పై దాడి చేసేందుకు అర్సపల్లి చౌరస్తా వద్దకు వచ్చాడు. అదే సమయంలో అక్కడ ఉన్న వారు జబ్బార్‌కు నచ్చజెప్పి పంపించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు.

యువకుడి చేతిలో వేటకొడవలి

కొబ్బరి చెట్టు పైనుంచి పడిన వ్యక్తి మృతి

సిరికొండ, ఏప్రిల్ 1: కొబ్బరి చెట్టు పైనుంచి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తూంపల్లి గ్రామానికి చెందిన దాసరి రజనీశ్(38) సోమవరం కొబ్బరి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

కోటగిరి, ఏప్రిల్ 1: జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోటగిరిలో చోటుచేసుకున్నది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరికి చెందిన వన్నే సుభాష్(42) తాగుడుకు బానిసయ్యాడు. దీంతో అతడి భార్య కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ.. కూలీ పని చేసుకొని జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి రాలేదు. చుట్టుపక్కల వారు తెలియజేయడంతో వన్నే సాయిలు తన భార్య, చుట్టుపక్కల వారితో కలిసి రాత్రి తలుపు తెరిచి చూశారు. సుభాష్ ఉరేసుకొని చనిపోయాడు. సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.

యువకుడి అదృశ్యం

రుద్రూర్, ఏప్రిల్ 1: మతిస్థిమితంగా లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన రుద్రూర్‌లో చోటుచేసుకున్నది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం. కర్రోళ్ల విజయ్‌కుమార్‌కు మతిస్థిమితంగా లేదు. అతడు అప్పుడప్పుడు ఇంట్లో నుంచి వెళ్లి కొన్ని రోజులకు తిరిగి వచ్చేవాడు. మార్చి 11వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిన అతడు తిరిగి రాకపోవడంతో.. భార్య ప్రియాంక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయన్న తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిచెంతకు..

బాలుడిని తల్లికి అప్పగిస్తున్న హెచ్‌సీ అరుణ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 1: తప్పిపోయిన బాలుడిని తల్లి వద్దకు చేర్చింది ఒక మహిళా హెడ్ కానిస్టేబుల్. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకున్నది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన కేశిరెడ్డి లత తన రెండున్నరేండ్ల బాబును తీసుకొని జిల్లా ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. బాబును దవాఖాన క్యారిడార్‌లో వదిలి పని చూసుకుంటున్నది. బాబు ఒంటరిగా బయటికి వచ్చి బస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ డ్యూటీలో ఉన్న మహిళా హెడ్‌కానిస్టేబుల్(హెచ్‌సీ) అరుణ బాలుడిని గమనించి దగ్గరకు తీసుకున్నది. వివరాలు సేకరించి, బాలుడి తల్లికి అప్పగించింది. మహిళా హెడ్‌కానిస్టేబుల్‌కు బాలుడి తల్లి కృతజ్ఞతలు తెలిపింది. పిల్లలను బయటికి తీసుకెళ్లిన సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌హెచ్‌వో ఈ సందర్భంగా సూచించారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఇందల్వాయి, ఏప్రిల్ 1: మండలంలోని గౌరారం గ్రామంలో మత్తడి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి పలువురు రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వాగు నుంచి పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఆయన సానుకూలంగా స్పందించారని రైతులు తెలిపారు. కార్యక్రమంలో దాసు, కిష్టయ్య, ప్రసాద్, హరీశ్, సాయికుమార్, ప్రశాంత్, గంగారాజం, కావ్య, తులసమ్మ, సాయారెడ్డి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యువనేత ప్రీతమ్ దేశాయ్ హఠాన్మరణం

- **నివాళులర్పించిన పలువురు ప్రముఖులు**

ప్రీతమ్ దేశాయ్ (ఫైల్)

బోధన్, ఏప్రిల్ 1: బోధన్ పట్టణ బీఆర్ఎస్ యువ నాయకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్ రావు దేశాయ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతా దేశాయ్ దంపతుల కుమారుడు ప్రీతమ్ దేశాయ్(45) మంగళవారం మధ్యాహ్నం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. మంగళవారం మధ్యాహ్నం పట్టణంలో జరిగిన విందుకు కుటుంబ సభ్యులతో హాజరై తిరిగి స్వగృహానికి చేరుకోగానే గుండెనొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే దవాఖానకు తరలించే లోపే ఆయన కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. పట్టణంలోని గోశాల రోడ్డులో ఉన్న ఆయన స్వగృహంలో భౌతిక కాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు బుధవారం ఉదయం 11 గంటలకు స్వగ్రామమైన రుద్రూర్ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేత్రదానం..

ప్రీతమ్ దేశాయ్ మరణానంతరం ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో లయన్స్ కంటి దవాఖానకు వైద్య సిబ్బంది ప్రీతమ్ దేశాయ్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు పంపారు. మరణానంతరం తన నేత్రాలను దానం చేసి ఇరువురు అంధులకు చూపును ప్రసాదించిన ప్రీతమ్ దేశాయ్‌కి లయన్స్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.బసవేశ్వర్ రావు, లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు నివాళులర్పించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఏర్గట్ల, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రెండ్ల రాజారెడ్డి మంగళవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ మాట్లాడుతూ ఈజీఎస్ నిధులతో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణ మాఫీ చేయాలి

దండిగుట్టలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

నవీపేట, ఏప్రిల్ 1: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ రూ. రెండు లక్షల రుణ మాఫీ చేయాలని బినోలా సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బినోలా సొసైటీ ఆధ్వర్యంలో నిజాంపూర్, బినోలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పాలకవర్గ సభ్యులు, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మగ్గరి హన్మాండ్లు మాట్లాడుతూ రైతు భరోసా పథకం కూడా అర్హులకు అందలేదని మండిపడ్డారు. తమ సొసైటీలో 900లకు పైగా రైతులు ఉంటే సగం మందికే రుణమాఫీ వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో రమేశ్, వైస్ చైర్మన్ ఖాజ ఆశమొద్దీన్(బాబర్), సొసైటీ డైరెక్టర్లు విజయ్, ప్రదీప్ రావు, గంగాధర్, బాల్‌చందర్, సొసైటీ రైతులు మహేంధర్, రమేశ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రెంజల్, ఏప్రిల్ 1: మండలంలోని దండిగుట్ట, రెంజల్, నీలా, కునేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ ఎంపీపీ మోబిన్‌ఖాన్‌తో కలిసి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రఫియొద్దీన్, బోధన్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దనుంజయ, రెంజల్ విండో మాజీ చైర్మన్ సాయిరెడ్డి, ఏపీఎం చిన్నయ్య, జావిదుద్దీన్, కుర్మె శ్రీనివాస్, సాయిబాబాగౌడ్, ఇందిరా రెడ్డి, రఘు, సీసీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసి వేతను అడ్డుకున్న రైతులు

- **ఆర్‌యూబీ పనుల కోసం మూసివేత తప్పదన్న అధికారులు**
- **జీపీ నుంచి లేఖ అందిస్తే రెండు రోజులు అవకాశమిస్తామని వెల్లడి**

ధర్యాపూర్ రైల్వే గేటు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నవీపేట, ఏప్రిల్ 1: ధర్యాపూర్ రైల్వే గేటు మూసివేతను రాంపూర్, ఫత్తేనగర్, ఎల్‌కేఫారం ధర్యాపూర్ గ్రామాలకు చెందిన రైతులు అడ్డుకున్నారు. మండలంలోని ధర్మారం, మహంతం, ధర్యాపూర్ మ్యాన్ లెవల్ గేట్ల వద్ద కేంద్ర ప్రభుత్వం రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)లను మంజూరు చేసింది. ఈపనుల్లో భాగంగా ఇప్పటికే ధర్మారం, మహంతం రైల్వే గేట్లను మూసివేశారు. మంగళవారం ధర్యాపూర్ రైల్వే గేటును మూసి వేసేందుకు రైల్వే అధికారులు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఫత్తేనగర్, రాంపూర్, ఎల్‌కేఫారం, ధర్యాపూర్‌కు చెందిన రైతులు తరలి వచ్చారు. తమ గ్రామాలకు సమాచారం ఇవ్వకుండా గేటును ఎలా మూస్తారని రైల్వే అధికారులను ప్రశ్నించారు. అందుకు అధికారులు స్పందిస్తూ గేటు మూసి వేతపై మూడు రోజులు ముందుగానే స్థానిక పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయాలకు సమాచారం అందజేశామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో గేటు మూసి వేసి త్వరలో ఆర్‌యూబీ పనులను ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు. రైతులు మాట్లాడుతూ వరి కోతలు చేతికి వచ్చాయని, ధన్యాన్ని రైస్ మిల్లర్లకు తరలి వచ్చేందుకు ఇబ్బంది అయ్యే అవకాశముందని అన్నారు. గేటు మూసి వేతకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. రైతుల విన్నపం మేరకు ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ నుంచి లిఖిత పూర్వకంగా లేఖ తీసుకువస్తే రెండు రోజుల పాటు సమయం ఇస్తామని ఆర్‌యూబీ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవి ప్రకాశ్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రమేశ్, దొంత ప్రవీణ్‌కుమార్, నిజామొద్దీన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నగరంలో కత్తిపోట్ల కలకలం

- **వేర్వేరు ప్రదేశాల్లో ముగ్గురిపై దాడి**
- **రంజన్ పండుగ పూట వెలుగుచూసిన ఘటనలు**

వినాయక్‌నగర్, ఏప్రిల్ 1: జిల్లా కేంద్రంలోని రెండు వేర్వేరు ప్రదేశాల్లో సోమవారం రంజాన్ పండుగ రోజు జరిగిన కత్తిపోట్ల ఘటనలు కలకలం రేపాయి. నాల్గో, ఆరో టౌన్ పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటనల వివరాలు ఉన్నాయి. ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. పూలాంగ్ ప్రాంతానికి చెందిన అబ్బాస్ అలీ అదే ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్‌ను తరచూ వేధించేవాడు. దీంతో ఆగ్రహించిన ఆటోడ్రైవర్ అబ్బాస్ అలీపై కత్తితో దాడిచేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆరో టౌన్ పరిధిలోని నయా బ్రిడ్జి వద్ద జునైద్ అనే యువకుడిపై జియా కత్తితో దాడిచేశాడు. అంతకు ముందు అతడు రోడ్డుపై వెళ్తున్న సదమ్‌పై దాడిచేసి గాయపర్చాడు. జియా ఈ మధ్యనే జైలు నుంచి బెయిల్‌పై విడుదల అయ్యాడని స్థానికులు తెలిపారు. ఈ కత్తిపోట్ల విషయమై ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావ్‌ను వివరణ కోరగా.. దాడి జరిగింది వాస్తవమేనని, చిన్న గొడవ అని చెప్పారు. పాత కక్షలతో గొడవ జరిగిన ఈ విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడ్డీ వ్యాపారి ఇంటిపై 'టాస్క్‌ఫోర్స్' దాడులు

- **34 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్1: అప్పులు ఇచ్చి అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న ఓ వ్యక్తి ఇంటిపై సోమవారం రాత్రి జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య నేతృత్వంలో దాడులు నిర్వహించారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద లభించిన 34 ద్విచక్ర వాహనాలను స్వాధీన చేసుకొని ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణకు అప్పగించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 1: మద్యం తాగి వాహనం నడిపిన సంఘటనలో మారుతి అనే వ్యక్తికి రెండు రోజులు జైలుశిక్ష విధిస్తూ మంగళవారం బోధన్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి తీర్పు చెప్పారు. వాహనాల తనిఖీలో భాగంగా పొతంగల్ గ్రామానికి చెందిన మారుతీ మద్యం తాగి వాహనం నడిపగా పోలీసులు పోలీసులు పట్టుకొని మంగళవారం న్యాయస్థానంలో హాజరు పర్చారు. ఆ వ్యక్తికి జైలుశిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్, న్యూసెన్స్ కేసులో..

ఆర్మూర్‌టౌన్,మార్చి1: మద్యంతాగి పట్టుబడిన ఆర్మూర్ పట్టణంలోని అశోక్ నగర్‌కు చెందిన కాపెల్లి దేవరాజుకు ఆర్మూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ మంగళవారం తెలిపారు. కమ్మర్‌పల్లికి చెందిన షేక్ మునీర్ తన బైక్‌ను అత్యంత ధ్వనితో ఆర్మూర్ పట్టణంలో నడుపుతూ న్యూసెన్స్ సృష్టించడంతో అతడికి న్యాయమూర్తి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డుపైనే చెత్త

రోడ్డు పక్కన